# ఐక్య సంఘటన, రైతాంగ ఉద్యమమూ, కమ్యూనిస్టుపార్టీ

ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

*(మావో రచనల తొలి సంపుటి ఆంగ్ల ప్రచురణ వెలువడిన వెంటనే నాటి భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, ఆ రచనలను పరిచయం చేస్తూ, సమీక్ష చేస్తూ ఆంగ్లంలో వ్రాసిన వ్యాసం **1954** సం॥లో 'న్యూ యేజ్' పత్రికలో ప్రచురితమైంది. ఆ సమీక్షకు ఇది తెలుగు అనువాదం. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో ఆంతరంగికంగానూ, కమ్యూనిస్టు శ్రేణులలోనూ భారత విప్లవానికి సంబంధించిన అనేక సమస్యలపై గంభీరమైన చర్చలు సాగుతున్న కీలక సమయంలో మావో రచనల మొదటి సంపుటంలోని ఐక్య సంఘటన గురించిన అంశాలు మార్గదర్శకంగా తోడ్పడతాయని ఆయన ఇందులో పేర్కొన్నారు. విప్లవ రైతాంగ ఉద్యమ నిర్మాణ ఆవశ్యకతను పేర్కొంటూ మావో కీలకాంశంగా దీనిని నొక్కి చెప్పిన విషయాన్ని మనముందుంచారు. కామ్రేడ్ మావో సారధ్యంలో చైనా కమ్యూనిస్టు పార్టీ వర్గ విశ్లేషణ సరిగ్గా చేసుకొని, శత్రువులను మిత్రులను స్పష్టంగా నిర్వచించుకోవటం కీలకమైనదిగా పేర్కొన్నారు. అలాగే పార్టీలో అంతర్గతంగా వ్యక్తమయ్యే కార్మికవర్గేతర ధోరణుల మూలాలకు వ్యతిరేకంగా నిరంతరాయ పోరాటం ద్వారానే పార్టీని కాకలు తీరేలా మలుచుకున్న విషయాలను ఆయన ఈ సమీక్షలో నొక్కి చెప్పారు. **1926-37** సం॥ల మధ్య కాలానికి మాత్రమే మావో రచనల మొదటి సంపుటి పరిమితం కాగా, మావో రచనల మిగిలిన సంపుటాల కోసం ఎదురుచూస్తున్నామని ఆయన ఆతృత కనబరిచారు.*

**1951-52** సార్వత్రిక ఎన్నికల తదనంతరం, అంతకు ముందు కూడా కాంగ్రెసేతర పార్టీలు, సమూహాలు, వ్యక్తులు తమ శక్తులను సమీకరించుకొని ఒక ఐక్య ప్రతిపక్షాన్ని ఏర్పాటు చేస్తే, అదే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి, కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని 'ఐక్య సంఘటన' గురించిన తప్పుడు అవగాహనను మనలో చాలామందిమి కలిగి వున్నాం. గత రెండు సం॥లుగా మన దేశంలో సాగుతున్న రాజకీయ పరిణామాలు ఈ అవగాహన ఎంత తప్పో తెలియజేశాయి.

దేశం మొత్తంమీద కాంగ్రెస్ పార్టీ సాధించిన ఓట్ల సంఖ్య తక్కువే అయినప్పటికీ అధికారంలోకి రాగలిగింది. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తనను వ్యతిరేకించిన - కొచ్చిన్, ట్రావెన్‌కోర్‌లలోని ప్రజా రిపబ్లికన్ పార్టీ, మద్రాసులోని కామన్‌వీల్, తమిళనాడు టాయిలర్స్ పార్టీలు; పెప్సు (పటియాలా అండ్ ఈస్ట్ పంజాబ్ స్టేట్స్ యూనియన్)లోని ఒక పెద్ద విభాగపు అకాలీలు, రాజస్థాన్‌లో జాగీర్దార్లు మొ॥ వారిలో ఎక్కువ శక్తులను గెలుచుకోవటంలో కాంగ్రెస్ విజయం సాధించింది. మద్రాసులోని తమిళనాడు టాయిలర్స్ పార్టీ, కామన్‌వీల్ రెండు సమూహాలు యుడిఎఫ్‌లో చేరి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించటమే గాకుండా ట్రావెన్‌కోర్, కొచ్చిన్, పెప్సులలో కూడా 1951-52 నాటికంటే తాజా ఎన్నికలలో కాంగ్రెస్ మెరుగైన పరిస్థితిని కనబరచగలిగింది.

అదే సమయంలో 1951-52లో ఘనమైన శక్తిగా కనపడిన కాంగ్రెస్ గత రెండు సం॥లుగా బీటలువారుతున్న చిహ్నాలు కనిపించాయి. గత రెండు సం॥లుగా వివిధ రాష్ట్రాలలో ముందుకొచ్చిన మంత్రివర్గ సంక్షోభాల సంఖ్య - మంత్రులను మార్చటంతోనో, అతుకులు వేయటంతోనో బయట పడినట్లు అనిపించినప్పటికీ - కాంగ్రెస్ నాయకత్వంలో మితవాద శక్తులు స్పష్టంగా సంఘటితమయ్యారనటం కూడా స్థిరమైనది కాదని తెల్పుతోంది.

పిఎస్‌పి, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్‌బ్లాక్, పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ మొదలైన ఇతర పార్టీలు కూడా సంఘటితమవటానికి ఇలాంటి ప్రయత్నాలే చేశాయి. ఇదే రకమైన ఆంతరంగిక సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. కెఎమ్‌పిపి, సోషలిస్టు పార్టీలు ఐక్యమై పిఎస్‌పిగా ఏర్పడటం; నెహ్రూ - జయప్రకాష్ చర్చలు పిఎస్‌పిలో అంతర్గత సంక్షోభానికి దారితీయటం; ఆర్ఎస్‌పి, పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, వామపక్షానికి చెందిన మరికొన్ని పార్టీలు 'ఆల్ ఇండియా మార్క్సిస్టు ఫ్రంట్'గా పిలవబడేదానిని ఏర్పాటు చేయటం; 'పాకిస్థాన్‌పై ఆంక్షలు' నినాదంతో 1952లో 'కాంగ్రెసేతర, కమ్యూనిస్టేతర పార్టీల ఐక్య సంఘటన' ఏర్పడటం - వంటి పరిణామాలను గుర్తుచేసుకుంటే సరిపోతుంది. విపక్షంలో వున్న వివిధ పార్టీల నడుమ పరస్పర సంబంధాలు ఎంత సంక్లిష్టంగా వున్నాయో అప్పుడే మనం చూడగలం.

ఈ విధమైన పరిణామాలు అన్ని రాజకీయ పార్టీలలోనూ ఎందుకు చోటుచేసుకుంటున్నాయి? ఈ పరిణామాలను కమ్యూనిస్టు పార్టీ ఏ విధంగా అధ్యయనం చేయాలి? ఈ పరిణామాల వెలుగులో ఈ పార్టీలన్నింటిపట్ల తన విధానాన్ని అది ఏవిధంగా రూపొందించుకోవాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలను భారత కమ్యూనిస్టులు తెలుసుకోవాలి.

కనుక, వారు మావో సేటుంగ్ ఏరిన రచనలను అధ్యయనం చేయాలి. ఈ రచనల మొదటి సంపుటి ఇప్పటికే

బయటకొచ్చింది. ఇతర సంపుటాలు కూడా రానున్నాయి. కార్మికవర్గ నాయకత్వంలో 'సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ఐక్య సంఘటన' నిర్మాణం చేయటానికి చైనా కమ్యూనిస్టు పార్టీ సాగించిన పోరాటానికి సంబంధించిన విలువైన అనుభవాలు, గుణపాఠాలు ఈ రచనలలో మనకు లభిస్తాయి.

వివిధ దశలలో చైనాలో తలెత్తిన రాజకీయ పరిస్థితులకు, మన దేశంలో రాజకీయ పరిస్థితికి సారూప్యతలను కనుగొనే ప్రయత్నం చేయలేనపుడు, మన దేశంలో వ్యూహం, ఎత్తుగడలను నిర్ణయించుకునేందుకు మనదేశ నిర్దిష్ట పరిస్థితులను పరిశీలించేటపుడు, మౌలిక సూత్రాలకు దృఢంగా కట్టుబడి వుంటూనే కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చైనా రాజకీయ పరిణామాల చరిత్రలోని వివిధ మలుపులు, మెలికలలో అవసరమైన ఎత్తుగడలను ఏవిధంగా రూపొందించు కుందో పదే పదే ఆ రచనలను అధ్యయనం చేయటం ద్వారా అర్థమౌతుంది.

ఒకవైపున కామ్రేడ్ మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అవకాశవాదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగిస్తూ, మరోవైపున అంతర్గత ఒంటెత్తు వాదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించటం ద్వారానే విప్లవోద్యమ పరిణామాలలోని ప్రతి దశలోనూ సరైన, నిర్దిష్టమైన ఎత్తుగడలను రూపొందించుకోగల్గటమనేది మన అధ్యయనానికి, అవగాహన చేసుకోవటానికి, అనుకరించటానికి గాకుండా అన్వయించుకోవటానికి తోడ్పడుతుంది.

## ఐక్య సంఘటన, వర్గపోరాటం

ప్రస్తుతం లభిస్తున్న ఏరిన రచనలు మొదటి సంపుటంలో 1926-37 మధ్య 12 సం॥ల కాలంలోని మావో ప్రముఖమైన రచనలు వున్నాయి. 'చైనా సమాజంలో వర్గ విశ్లేషణ' శీర్షికతో నున్న వ్యాసంతో ఈ సంపుటం ప్రారంభమౌతుంది. 1926 మార్చిలో రాసిన ఈ వ్యాసం, ఐక్య సంఘటనకు సంబంధించిన మౌలిక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఒక ప్రశ్నతో - దాదాపు మనకూ సవాల్‌గా వుండే ప్రశ్నతో - ఈ వ్యాసం ప్రారంభ మౌతుంది.

మావో తన వ్యాసంలోని మొదటి పేరాను 'మన శత్రువులెవరు? మన మిత్రులెవరు?' అనే ప్రశ్నతో ప్రారంభిస్తారు. "ఇది విప్లవానికి మొట్టమొదటి ప్రధానమైన ప్రశ్న. చైనాలో గతంలో విప్లవ పోరాటాలన్నీ చాలా తక్కువ ఫలితం సాధించటానికి మూలకారణం - నిజమైన శత్రువుల నెదిరించటానికి నిజమైన మిత్రులందరితో ఐక్యమవటంలో విఫలత చెందటమే. విప్లవ పార్టీ ప్రజాసామాన్యానికి మార్గదర్శి; విప్లవ పార్టీ ప్రజలను గమ్యరహితంగా నడిపితే ఏ విప్లవమూ ఎన్నటికీ విజయవంతం కాదు. మనం విప్లవంలో తప్పనిసరిగా విజయం పొందడానికీ, ప్రజలను గమ్యరహితంగా నడపకుండా ఉండటానికీ జాగ్రత్త పడాలంటే అసలైన శత్రువులను ఎదుర్కోవటానికి నిజమైన మిత్రులతో ఐక్యమయేందుకు శ్రద్ధ వహించాలి" (మావో సెలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్ 1, పేజి 13)

ఏమైనా మిత్రులు, శత్రువుల గురించి మావో మాట్లాడేటప్పుడు ఆయన వ్యక్తులు, సమూహాలు, పార్టీల గురించి కాకుండా వర్గాల గురించి మాట్లాడాలని స్పష్టం చేశారు.

వ్యక్తులు, సమూహాలు, పార్టీలు రాజకీయాలలో పరిగణించ దగినవే అయినప్పటికీ, ఐక్య సంఘటన యొక్క సరైన ఎత్తుగడలను రూపొందించుకోవటంలో వాటి పరస్పర సంబంధాలను చాలా జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. ఈ కారణంగానే, ఈ సంపుటంలో సేకరించిన తదుపరి రచనల్లో కొమింగ్‌టాంగ్ లోపలనే కాదు; వ్యక్తుల దృక్పథాల్లో వచ్చిన మార్పులు, పరిణామాలను చాలా వివరంగా పరిశీలించటాన్ని మనం చూస్తాం.

సియాన్ సంఘటనలో మధ్యవర్తిత్వం నెరపటానికి చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన ప్రయత్నాలలో చరిత్రగతిని మార్చే నిర్ణయాత్మక పాత్ర పోషించే విధంగా వ్యక్తులకు కూడా ఈ అవగాహనను అన్వయించి విప్లవ శక్తులు ఏ విధంగా ఫలితం రాబట్టాయో చూడగలం. "సియాన్ సంఘటన శాంతియుతంగా పరిష్కారం కావటం పౌరయుద్ధం కోసం సేనలను మోహరించిన జపాన్ సామ్రాజ్యవాదుల కుట్రలపై, చట్టభీతిలేని దేశీయ దళారీ సమూహాలపై ఒక దెబ్బ కొట్టింది. అంతర్గత అభిప్రాయ బేధాలను రేకెత్తించి, సియాన్ సంఘటన సందర్భంగా చియాంగ్‌ను అంతంచేసే ఉచ్చులో ఇరికించారు.. పరిస్థితి కనుగుణంగా చియాంగ్ జాగృతం కావటమనే సూచిక దశాబ్ద కాలపు తన తప్పుడు విధానానికి ముగింపు పలికే కొమింగ్‌టాంగ్ సంసిద్ధతకు సంకేతంగా పరిగణించవచ్చు". (పేజి 254)

ఏమైనా, వ్యక్తులు, సమూహాలు, పార్టీలు - ఇవేవీ అంతిమంగా చరిత్రగతిని నిర్ణయించేవి కావు; ఐక్యసంఘటన ఏర్పరిచే మన ప్రయత్నాలలో వారి పరస్పర సంబంధాలను తిన్నగా చేయటమే కాదు; నిర్ణయాత్మకమైనదేమంటే వర్గాలుగా విడివడి వున్న కోట్లాదిమంది ప్రజానీకం - వీరు మాత్రమే అంతిమంగా చారిత్రక పరిణామాల గతిని నిర్ణయిస్తారు. వ్యక్తులు, సమూహాలు, పార్టీలు నిస్సందేహంగా చరిత్రలో కొన్ని నిర్దిష్ట వర్గాల ప్రతినిధులుగా వారి వంతు పాత్ర నిర్వహిస్తారు. కనుక, వర్గరహితంగా ఐక్య సంఘటన నిర్మాణం చేసే ప్రయత్నాలేవైనా - కొన్ని ఇతర పార్టీలకు, సమూహాలకు, వ్యక్తులకు వ్యతిరేకంగా మరికొన్ని పార్టీలను, సమూహాలను, వ్యక్తులను - ఈ పార్టీలు, సమూహాలు, వ్యక్తులు ప్రాతినిధ్యం వహించే వర్గాలు లేదా వర్గాన్ని పరిగణలోకే తీసుకోకుండా ఐక్యం చేసే ప్రయత్నం - ఒకరికి వ్యతిరేకంగా మరొకరిని మోహరించటమే అవుతుంది. ఇది మనలను తప్పుడు నిర్ధారణలకు దారితీయటంతోపాటు, పూర్తి నిరుత్సాహానికి గురిచేస్తుంది.

కామ్రేడ్ మావో ఇలా అన్నారు : "నిజమైన మిత్రులను శత్రువుల నుండి వేరుచేసి తెలుసుకోవాలంటే చైనా సమాజంలోని వివిధ వర్గాల ఆర్థికస్థితినీ, విప్లవం పట్ల ఆయా వర్గాల వైఖరినీ మనం మొత్తంగా విశ్లేషించి చూడాలి." (పేజి 13) చరిత్ర అభివృద్ధిలో ప్రధాన శక్తులుగా వర్గాలపై చేసిన ఈ వక్కాణింపు, చైనా కమ్యూనిస్టు పార్టీ ఏ వర్గాలు ఐక్యం కావాలని చెప్పిందీ, ఆ వర్గాలను ఎలా ఐక్యపరిచిందీ పరిశీలించటం మనకు చాలా అవసరమైనది. అలాగే ఏ వర్గాలకు వ్యతిరేకంగా ఐక్య సంఘటన నిర్మాణం చేయాలనేది పరిశీలించటం కూడా మనకు అవసరం.

ఈ కారణం చేతనే మొదటి వ్యాసమైన 'చైనా సమాజంలో వర్గ విశ్లేషణ'ను రెండో వ్యాసమైన 'హునాన్ రైతు ఉద్యమం : ఒక పరిశీలనా నివేదిక'తో కలిపి అధ్యయనం చేయాలి. కామ్రేడ్ మావో మొదటి వ్యాసాన్ని ప్రజాశత్రువులు, మిత్రులు ఎవరు అనేది నిర్వచిస్తూ ముగించారు.

"....సామ్రాజ్యవాదులతో కుమ్మక్కు అయ్యే వారంతా – యుద్ధ ప్రభువులూ, నిరంకుశాధికారులూ, దళారీవర్గం, బడా భూస్వామ్యవర్గం వారికి అనుయాయులుగా వుండే అభివృద్ధి నిరోధక మేధావివర్గం – వీరంతా మన శత్రువులు".

"పారిశ్రామిక కార్మికవర్గం మన విప్లవానికి నాయకత్వ శక్తి"

"యావత్తు అర్ధశ్రామికవర్గం, పెటీబూర్జువా వర్గం మన సన్నిహిత మిత్రులు"

"ఇక వూగిసలాడే మధ్యతరగతి వర్గంలోని మితవాదవర్గం మనకు శత్రువుగానూ, అందులోని వామపక్షం మనకు మిత్రుడుగానూ తయారు కావచ్చు. కానీ ఎప్పుడైనా మన శ్రేణుల్లో వారు గందరగోళం సృష్టించటానికి అవకాశం ఇవ్వకుండా మనం జాగ్రత్తవహించాలి" (పేజి 20)

## రైతాంగ ఉద్యమం - కీలకాంశం

మన సన్నిహిత మిత్రులను ఐక్యం చేయటం ద్వారా సరిగ్గా ఏమి సాధించాల్సి వుంటుంది. పీడకులకు వ్యతిరేకంగా కోట్లాది మంది రైతాంగం తిరగబడేందుకు అది సహకారిగా వుండాలి. ఈ సంపుటిలోని రెండో వ్యాసంలో ఈ ప్రశ్నకు సమాధానం చెప్పుకుంటూ కామ్రేడ్ మావో ఇలా అన్నారు :

"రైతాంగ ఉద్యమంలో ప్రస్తుత వెల్లువ ఒక బృహత్తర సంఘటన. అనతికాలంలోనే చైనాలోని మధ్య, దక్షిణ, ఉత్తర రాష్ట్రాలలో అనేక కోట్లమంది రైతులు గొప్ప తుపానులాగా, బ్రహ్మాండమైన ఉప్పెనలాగా విజృంభిస్తారు. ఎంతటి గొప్ప శక్తి అయినా అతివేగవంతమైన హింసాత్మకమైన ఈ శక్తిని అదుపు జేయజాలదు. తమకు సంబంధించిన సంకెళ్ళనన్నింటిని తెంచుకొని వారు విముక్తి మార్గాన ముందుకు సాగిపోతారు. వారు సామ్రాజ్యవాదులను, యుద్ధ ప్రభువులను, లంచగొండి అధికారులను, స్థానిక నిరంకుశులను, దుష్టపెత్తందార్లను – అందర్నీ వారి వారి గోరీల్లో పూడ్చిపెడతారు. ప్రతి విప్లవ పార్టీ, ప్రతి విప్లవకర కామ్రేడ్ పరీక్షకు పెట్టబడి, వారి నిర్ణయానుసారం స్వీకరించబడటమో, తిరస్కారానికి గురవటమో జరుగుతుంది." (పేజి 21, 22)

విప్లవకారుల ముందు ఆయన మూడు ప్రత్యామ్నాయాలను వుంచారు :

"వారికి అగ్రభాగాన నిలిచి వారికి నాయకత్వం వహించటం" లేదా, "వెనుకబడిన వారిని వెక్కిరించటం, విమర్శించటం" లేదా "వారిని వ్యతిరేకించి వారి దారికడ్డు నిలవటం".

"ప్రతి చైనీయుడూ ఈ మూడు ప్రత్యామ్నాయాలలో దేనినైనా స్వేచ్ఛగా ఎంచుకోవచ్చు. కానీ ఏదో ఒకటి త్వరగా తేల్చుకునేలా పరిస్థితులే డిమాండ్ చేస్తాయి".

కామ్రేడ్ మావో, మరియు చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని ఆయన సహచరులు అతివాద అవకాశవాదం, మితవాద అవకాశవాదాలు రెండింటికీ వ్యతిరేకంగా నిలకడైన పోరాటం సాగించారు. కనుక మొదటి ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవటంలో వీరికి ఎటువంటి తటపటా యింపులూ లేవు. 'హునాన్ రైతు ఉద్యమం : పరిశీలనా నివేదిక' వ్యాసమంతా ఉద్యమంలోని రైతాంగ ప్రజానీకం, చెన్ టూషి వంటి అవకాశవాదులకు మతిపోయేలా చేసిన గొప్ప పనులను సమర్థిస్తూ, వాటిని ప్రశంసిస్తూ సాగే ఉత్తమ రచనగా వుంది.

"నేను చాంగ్షా చేరగానే అన్నిరకాల ప్రజల్నీ కలిశాను. చాలా కబుర్లు విన్నాను. మధ్యతరగతి నుండి కొమింగ్ టాంగ్ మితవాదుల వరకూ ప్రతి ఒక్కరూ ఈ వ్యవహారమంతా 'మహా ఘోరంగా' వుందనే అన్నారు. ఈ 'మహా ఘోరం' అనేవాళ్ళ ప్రభావంతో నగరం తలమునకలైంది. చివరకు విప్లవాభి మానులు కూడా గ్రామీణ ప్రాంతంలో జరుగుతున్న సంఘటనలను తమ మనస్సులో చిత్రించుకోవడంలో ఈ 'మహా ఘోరం' అనే పదాన్ని కాదనలేక నిస్పృహ పాలయ్యారు. చివరకు అభ్యుదయవాదులైన ప్రజలు కూడా "ఘోరమే.... అయినా విప్లవంలో ఇది తప్పనిసరి" అన్నారు. క్లుప్తంగా చెప్పాలంటే మొత్తం మీద ఈ 'ఘోరం' అనే పదాన్ని సొంతం ఎవరూ కాదనలేకపోయారు". (పేజి 24, 25)

'ఇది ఘోరం' అనే సిద్ధాంత లక్షణాన్ని మావో విశ్లేషిస్తూ 'ఇది ఘోరం' అనే సిద్ధాంతం ఖచ్చితంగా భూస్వాముల ప్రయోజనాలను కాపాడి, తిరగబడే రైతులను అణచడానికే సృష్టించబడింది; స్పష్టంగా ఇది భూస్వామ్యవర్గ సిద్ధాంతం. పాత భూస్వామ్య వ్యవస్థను నిలబెట్టడానికీ, నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొనకుండా అడ్డుకోడానికీ ఉద్దేశించినది. ఇది నిస్సందేహంగా విప్లవ ప్రతీఘాతుక సిద్ధాంతమే" (పేజి 25)

## విప్లవకారుల కర్తవ్యం

విప్లవకరమైన ఏ కామ్రేడూ ఈ బుద్ధిలేని మాటలను పునశ్చరణ చేయకూడదంటూ కామ్రేడ్ మావో ఇలా పేర్కొన్నారు :

"విప్లవ దృక్పథం నీలో దృఢంగా పాతుకొని వుంటే, గ్రామీణ ప్రాంతానికి పోయిజూస్తే నిస్సందేహంగా నీవు పూర్వం ఎప్పుడూ లేనంతగా గొప్ప ఉత్సాహ ఉద్రేకాన్ని పొందుతావు. బానిసలు గావింపబడిన అసంఖ్యాకులైన రైతులు తమ రక్తమాంసాలతో కొవ్వెక్కిన రైతుల్ని పడదోస్తున్నారు. వారు చేస్తున్నది సరైనది; చాలా బావుంది. 'అది చాలా బావుంది' అనటం రైతుల, యావత్తు విప్లవకారుల సిద్ధాంతం. జాతీయ విప్లవానికి గ్రామీణ ప్రాంతంలో గొప్ప మార్పు అవసరమని, విప్లవకారుడైన ప్రతి కామ్రేడూ తప్పక తెల్సుకోవాలి. 1911 నాటి విప్లవం ఈ మార్పును తీసుకురాలేదు కనుకనే, అది విఫలమైంది. ఇప్పుడామార్పు జరుగుతోంది. విప్లవకారుడైన ప్రతి కామ్రేడూ విప్లవ పరిపూర్తికి అవసరమైన ముఖ్యమైన దీనికి మద్దతునిచ్చి తీరాలి, లేకుంటే అతను ప్రతీఘాతుక విప్లవం కొమ్ముగాయటమే అవుతుంది". (పేజి 25–26)

"రైతు సంఘాలు ప్రస్తుతం చేపట్టిన చర్యలతో చాలా దూరం వెళ్ళాయి" అనే సిద్ధాంతాన్ని ఎదుర్కొనేందుకు, "ప్రస్తుత రైతాంగ ఉద్యమం అల్లరి మూకల ఉద్యమం, సోమరిపోతు రైతులు ఉద్యమం" అనే వాదనను పూర్వపక్షం చేసేందుకు తిరుగుబాటు చేస్తోన్న రైతాంగం 'విప్లవానికి అగ్రగాములు' అనే నినాదం చేపట్టారు. రైతు సంఘాల నాయకత్వాన రైతాంగం తమ ఉద్యమ క్రమంలో భూస్వాములచే వారి తొత్తులచే 'మహా ఘోరం'గా పేర్కొనబడే "14 గొప్ప పనులను" నిర్వర్తించారని కా॥ మావో పేర్కొన్నారు. తిరుగుబాటు చేస్తోన్న రైతాంగం చేపట్టిన ఈ 14 గొప్ప పనులు మావో దృష్టిలో ఎంతో ప్రాధాన్యత కలవని స్పష్టమౌతోంది.

★ "రైతులను రైతు సంఘాలలో సంఘటితం చేయడం"తో ప్రారంభించి 14 గొప్ప పనులను కామ్రేడ్ మావో పేర్కొంటారు.
★ భూస్వాములను రాజకీయంగా దెబ్బతీయటం
★ భూస్వాములను ఆర్థికంగా దెబ్బతీయటం
★ స్థానిక నిరంకుశుల, దుష్టపెత్తందార్ల భూస్వామ్య పాలనను కూలద్రోయటం
★ భూస్వాముల సాయుధ బలగాలను కూలద్రోసి, రైతాంగ సాయుధ బలగాలను నెలకొల్పటం
★ కౌంటీ మేజిస్ట్రేట్ అతని అమీనాల రాజకీయ అధికారాన్ని కూలద్రోయటం
★ ప్రాచీన ఆరాధనాలయాల ధర్మకర్తల, వంశ పెద్దల, నగర, గ్రామదేవతల, మతాధికార సంస్థల పెత్తనాన్ని, భార్యలపై భర్తల పెత్తనాన్ని తుదముట్టించటం
★ విస్తృత రాజకీయ ప్రచారాన్ని సాగించటం
★ రైతులు కట్టడులు, నిషేధాలు (చీట్లాట, జూదం, నల్లమందు మొ॥వాటిపై) విధించటం
★ బందిపోట్లను రూపుమాపటం
★ మితిమీరిన లెవీలను రద్దుచేయటం
★ సాంస్కృతికోద్యమం సాగించటం
★ సహకారోద్యమం నిర్మించటం
★ రోడ్లు వేయటం, కరకట్టలు బాగుచేయటం

పైన వివరించిన 14 పనులూ రైతు సంఘాల నాయకత్వంలో రైతులు సాధించారు. వీటిలో ఏ ఒక్కటైనా వాటి మూలతత్వంలోగానీ, విప్లవ ప్రాముఖ్యతలోగానీ చెడ్డవని అనగలమా? స్థానిక నిరంకుశులు, దుష్టపెత్తందార్లు మాత్రమే వీటిని చెడ్డవని అంటారేమో?!" (పేజి 58–59)

## అవకాశవాదానికి వ్యతిరేకంగా మావో పోరాటం

విప్లవ రైతాంగ ఉద్యమం పట్ల ఈ వైఖరి కలిగివుంటూ, కామ్రేడ్ మావో, అతని సహచరులు పార్టీలోపల కూడా దీనికనుగుణంగా సుదీర్ఘ పోరాటం సాగించవలసి వచ్చింది. బూర్జువావర్గం కార్మికవర్గం నడుమ కూటమితో ఐక్య సంఘటన ఏర్పరచాలనే తమ స్వీయ అవగాహనతో పార్టీ నాయకత్వంలోని ఒక విభాగం చెన్‌టుషి ఆధ్వర్యంలో మావో ప్రతిపాదించిన వైఖరిని వ్యతిరేకించింది. కామ్రేడ్ మావో దీనికి వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటం సాగించాల్సి వచ్చింది.

"చైనా బూర్జువావర్గం కొన్ని నిర్దిష్ట చారిత్రక సందర్భాలలో విప్లవోద్యమంలో భాగస్వామి అయి వుండవచ్చు; అయితే ఆ వర్గపు స్వార్థ స్వభావం రీత్యాను, రాజకీయ, ఆర్థిక స్వతంత్రత లేని కారణంగాను, అది చైనా విప్లవ యుద్ధాన్ని సంపూర్ణ విజయం దిశగా నాయకత్వం వహించటానికి సిద్ధంగానూ లేదు, నాయకత్వం వహించనూ లేదు."

కామ్రేడ్ మావో రచనలలలో ఈ విషయం పదేపదే వ్యక్తమవుతూ వుంటుంది. వాస్తవికంగా చెప్పుకోవాలంటే, మన ముందున్న సంపుటం మొత్తం బూర్జువావర్గం దాని వివిధ విభాగాలు ఎప్పటికప్పుడు తమ స్థితిని ఎలా మార్చుకుంటూ వచ్చాయో, కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో కార్మికవర్గం దానిని అంచనా వేసుకుంటూ తదనుగుణంగా తన స్వీయ ఎత్తుగడలను ఎప్పటికప్పుడు ఏవిధంగా మార్చుకున్నదో అనే విషయాల్ని చారిత్రకంగా విశ్లేషించినదిగా చెప్పవచ్చు. చైనా చరిత్రలోని వివిధ దశలలో బూర్జువావర్గం ఏదోమేరకు నిర్వహించిన ప్రతిపక్ష పాత్రను అనుకూలమైనదిగా తీసుకుంటూనే, బూర్జువావర్గపు పూపుతాపులను అధిగమించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తూనే కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ అన్నివేళలా కనిపెట్టుకొని వుంటూ ఎప్పుడైనా అది విప్లవ ప్రతీఘాతుకమైన లేదా రాజీ వైఖరి చేపడితే దానికి వ్యతిరేకంగా వెనువెంటనే ప్రభావశీలమైన చర్యలను చేబడుతూ వచ్చింది.

అదే సమయంలో, లీలీసాన్, వాంగ్‌మింగ్‌ల ఆధ్వర్యంలో కొందరు పార్టీ నాయకుల సమూహం బూర్జువావర్గంతో పనేమీ లేదని, పెటీబూర్జువా వర్గంతో కానీ రైతాంగంతో కానీ పనేమీ లేదని పేర్కొంటూ కామ్రేడ్ మావో పేర్కొనే 'ఒంటెత్తువాదం'

వైఖరిని చేపట్టారు. ఈ సమూహం ముందుకు తెచ్చిన వాదనలపై కామ్రేడ్ మావో ఇలా అన్నారు :

"మూడవ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మరియు మన పార్టీ కేంద్రకమిటి సూచించిన ప్రకారం చైనాలో జాతీయ విప్లవం పూర్తి చేయాలంటే సామ్రాజ్యవాదం, దాని కీలుబొమ్మల పరిపాలనను కూలదొయ్యాలి. వ్యవసాయక విప్లవం ద్వారా రైతాంగంపై భూస్వామ్య దోపిడీని అంతం చేయాలి".

రైతాంగం, పట్టణ పెటీ బూర్జువావర్గాల యొక్క బలాన్ని, బలహీనతను కామ్రేడ్ మావో దృష్టికి తెస్తారు : "విప్లవ యుద్ధంలో చురుకుగా పాల్గొనేందుకు సంసిద్ధత మరియు దాని సంపూర్ణ విజయాన్ని సాధించటమనేది విప్లవ యుద్ధంలో ప్రధాన శక్తిగా వుంటుంది." "చిన్నతరహా ఉత్పత్తి అనేవారి లక్షణం వారి రాజకీయ దృష్టిని పరిమితం చేస్తుంది (నిరుద్యోగులలోని ఒక విభాగం అరాచక సిద్ధాంతాన్ని చేపడుతూంటారు) ఫలితంగా వారు సరైన నాయకత్వాన్ని అందించలేదు.

బూర్జువావర్గం యొక్క, రైతాంగం యొక్క, పట్టణ పెటీ బూర్జువావర్గం యొక్క ఈ ప్రత్యేక లక్షణాలను దృష్టిలో వుంచుకోవటం - పార్టీలో అంతర్గతంగా వ్యక్తమయ్యే కార్మికవర్గేతర దృష్టికోణానికి వ్యతిరేకంగా నిరంతరాయ పోరాటాన్ని కొనసాగించటానికి అత్యంత అవసరమైనవిగా వుంటాయి. ఈ పోరాటం ద్వారా కామ్రేడ్ మావో చైనా కమ్యూనిస్టు పార్టీని కాకలు తీరేలా చేసి వాస్తవిక అర్థంలో బోల్షివిక్ పార్టీలా మలచగలిగారు. 1940 ఆ తర్వాత సం॥రాలలో చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన వివిధ దిద్దుబాటు క్యాంపెయిన్‌లకు సంబంధించిన విషయాలు తప్పనిసరిగా కూడి వుండే కామ్రేడ్ మావో రచనల మిగిలిన సంపుటాల కొరకు మనం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాం.

## కార్మిక వర్గేతర సిద్ధాంతాలపై పోరాటం ద్వారానే బోల్షివీకరణ

ఏమైనా, 1929 సం॥ ప్రారంభం నాటికే కామ్రేడ్ మావో, ఆయన సహచరులు ఆ విధమైన పోరాటాలు నిర్వహించిన ఫలితంగానే ఈ మొదటి సంపుటంలో కూడా 'పార్టీలో తప్పుడు అభిప్రాయాలను సరిదిద్దటం' గురించిన చాలా ముఖ్యమైన మరో రచన వుంది. ప్రాముఖ్యం కలిగిన ఈ రచనలో కూడా పార్టీలో పెరుగుతున్న తప్పుడు అభిప్రాయాలకు గల మూలకారణం వరకు కా॥ మావో వెళ్ళారు.

"నాల్గవ ఎర్రసైన్యంలోని పార్టీ నిర్మాణంలో వివిధ తప్పుడు అభిప్రాయాలకు మూలం, దీని యొక్క పునాది యూనిట్లు - రైతులు, పెటీబూర్జువా స్వభావం కలిగినవారితో నిండి యుండటమే; పార్టీ నాయకత్వ సంస్థలు తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా నిశ్చయాత్మక పోరాటం తగినంత మేరకు జరపకపోవటం, సరైన పార్టీ పంథా గురించి పార్టీ సభ్యులకు గట్టి రాజకీయ శిక్షణ ఇవ్వలేక పోవటం వల్ల కూడా ఈ తప్పుడు ధోరణులు ఉండటానికి, పెరగటానికి దోహద మౌతోంది". (పేజి 105)

చైనా కమ్యూనిస్టు పార్టీ తన సామాజిక కూర్పులో అత్యధిక సభ్యులు రైతాంగం నుండి, పట్టణ పెటీబూర్జువా వర్గం నుండి వచ్చినవారనే వాస్తవం అలా వున్నప్పటికీ, చైనా కమ్యూనిస్టు పార్టీ ఒక నిజమైన కార్మికవర్గ దృక్పథాన్ని అభివృద్ధి చేయటానికి, క్లుప్తంగా చెప్పుకోవాలంటే కామ్రేడ్ మావో మరియు ఆయన సహచరులు - అత్యధిక పార్టీ సభ్యుల కార్మికవర్గేతర లక్షణాలకు, తప్పుడు అభిప్రాయాలకు ఆధారమైన మూలాలపై ఒక పద్ధతి ప్రకారం నిరంతరాయ పోరాటాన్ని సాగించారని గత 25 సం॥ల చరిత్ర తెలుపుతోంది.

శ్రామికవర్గ పార్టీలో తప్పుడు అభిప్రాయాల దిద్దుబాటు, వివిధ దేశాలలో ఒకే దేశంలో సైతం అనేక పద్ధతుల్లో చరిత్రలోని వివిధ దశలలో నిర్వహించాల్సి వుంటుంది. ఈ వ్యాసంలో కా॥ మావో బోధించిన విషయాలనన్నీ అనుకరించటం తప్పుడు పద్ధతవుతుంది. ఏమైనా ఈ వ్యాసం, కామ్రేడ్ మావో గుర్తించిన అనేక అంశాలను మనం అధ్యయనం చేయటానికి, అన్వయించుకోవటానికి తోడ్పడుతుంది.

మనం కేవలం కొద్ది ఉదాహరణలే ఇస్తున్నాం.

అతి ప్రజాస్వామికం : "క్రమశిక్షణను ధిక్కరించే పెటీ బూర్జువా అహంభావమే అతిప్రజాస్వామికానికి పునాది అన్న విషయాన్ని స్పష్టపరచాలి. ఈ స్వభావం పార్టీలో ప్రవేశించినపుడు రాజకీయంగా, నిర్మాణరీత్యా, పార్టీలో అతి ప్రజాస్వామిక ధోరణులు తలెత్తుటకు దోహదం చేస్తుంది. కార్మికవర్గ పోరాట కర్తవ్యాలకు, ఈ అతి ప్రజాస్వామిక ధోరణులకు ఎలాంటి పొత్తు పొసగదు". (పేజి 109)

సంపూర్ణ సమానత్వం : "రాజకీయ వ్యవహారాల్లో అతి ప్రజాస్వామికంలాగే, సంపూర్ణ సమానత్వ ధోరణి కూడా చేతి వృత్తుల, చిన్న రైతుల ఆర్థిక విధానం నుండి ఉత్పన్నమయిందే. తేడా అంతా ఒకటి రాజకీయాల్లో ప్రతిబింబిస్తే, మరొకటి వస్తువుల, సౌకర్యాల విషయంలో ప్రతిబింబిస్తుంది". (పేజి 111)

దుందుడుకువాదం : "దుందుడుకువాదానికి సాంఘిక పునాది అలగా శ్రామిక (లంపెన్ ప్రొలిటేరియట్) సిద్ధాంతం, పెటీబూర్జువా సిద్ధాంతాల యొక్క కలయికే. (పేజి 115)

తప్పుడు భావాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించే క్రమంలో కామ్రేడ్ మావో 'ఆచరణ'పై పేర్కొనదగిన తాత్విక రచన చేశారు. దీనితో మొదటి సంపుటం ముగుస్తుంది. మన దేశంలో ఈ రచనను పదే, పదే అధ్యయనం చేయాలి. ఏ ధోరణులకు వ్యతిరేకంగానైతే కామ్రేడ్ మావో పోరాడుతున్నారో, ఇక్కడ మనదేశంలో వివిధ రూపాల్లో అవే ధోరణులు వ్యక్తమవుతున్నాయి.

"ఆచరణతో జ్ఞానం ప్రారంభమై, ఆచరణ ద్వారానే సిద్ధాంత స్థాయికి చేరుకుని తర్వాత ఆచరణకు తిరిగి వస్తుంది. జ్ఞానం

యొక్క చురుకైన పాత్ర అనుభూతి జ్ఞానం నుండి హేతుబద్ధ జ్ఞానానికి చురుగ్గా గంతు వేయటంగా వ్యక్తీకరించబడటమేగాక, చాలా ముఖ్యమైన – హేతుబద్ధ జ్ఞానం నుండి విప్లవాచరణకు చేరుకోవటంలోనూ వ్యక్తమౌతుంది." (పేజి 292)

ఐక్య సంఘటన అంశం గురించి సమీక్ష చేసేందుకు ఈ అనుభవాలు, గుణపాఠాలనన్నీ మనం జీర్ణం చేసుకొని, అన్వయం చేసుకోవాలి.

ఐక్య సంఘటన యొక్క అసలైన విధానం – ఆచరణ ఫలితమే – అదీ సాధారణంగా ప్రపంచ విప్లవోద్యమ ఆచరణ, ప్రత్యేకించి మన దేశంలో ఆచరణ ఫలితమే. అయితే, ఆ విధానాన్ని ఆమోదించిన తర్వాత, దానిని మనం ఆచరించటానికి పూనుకోవాలి; ఈ ఆచరణ క్రమంలో మనమెన్నో కొత్త పాఠాలు నేర్చుకుంటాం. ఈ కొత్త పాఠాలను సమ్మిళితం చేసుకొని, సాధారణీకరించటం ద్వారా అవి మన భవిష్యత్ ఆచరణకు మార్గనిర్దేశం చేస్తాయి. ఐక్యసంఘటనను నిర్మించే ఆచరణ నుండి నిలకడగా ఆవిధమైన పాఠాలను, నిర్ధారణలను రాబట్టకుండా మొత్తం మీద ఐక్యసంఘటన ఉద్యమాన్ని బలోపేతం చేయలేము. వాస్తవానికి మన కేంద్రకమిటి ఈ విధంగా చేయటానికి ప్రయత్నించింది; ఇంకా ప్రయత్నం చేస్తూ వుంది కూడా. ఈ కర్తవ్యంలో కా॥ మావో రచనలు గొప్పగా సహకరిస్తాయి.

★★★★★